ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
3
శుక్రవారం 12 సెప్టెంబరు 2025



నేడు, రేపు లోక్ అదాలత్

కీసర రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు శుక్ర, శనివారాల్లో న్యాయశాఖ నిర్వహిస్తున్న లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని కీసర ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు గురువారం ప్రకటనలో కోరారు. రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకోవాలన్నారు. కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసులను కుషాయిగూడలోని న్యాయస్థానంలో పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. మరింత సమాచారం కోసం కీసర పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షను సజావుగా నిర్వహించాలి

» అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఈ నెల 14న నిర్వహించనున్న సప్లిమెంటరీ పరీక్షను సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పరీక్ష ఉదయం 10 గంటలకు, తిరిగి ఎరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్లాటింగ్ ఉంటుందని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షలో ఉత్తీర్ణత సాధించని 76 మంది థియరీ అభ్యర్థులు, 92మంది ప్లాటింగ్ అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో కాపీయింగ్ జరగకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లను అనుమతించకూడదని ఆదేశించారు. పరీక్ష రాసే అభ్యర్థులు ఏదేని ప్రభుత్వ గుర్తింపు కార్డును తీసుకురావాలని సూచించారు. పరీక్షల నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, డీఎంహెచ్‌వో లలితాదేవి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామిరెడ్డి, డీహెచ్ఎస్‌వో సత్తార్, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు సి.రాజు, తదితరులు పాల్గొన్నారు.



పెద్దేముల్ సహకార సంఘం వద్ద క్యూలో రైతులు

5

ఎరువు కోసం భారీ వర్షంలో..

జిల్లాలో యూరియా కోసం రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. గురువారం భారీ వర్షం కురుస్తున్నా సహకార సంఘాల ఎదుట క్యూ లైన్‌లో నిలబడి ఇబ్బందులు పడ్డారు. గొడుగు పట్టుకొని అలాగే గంటలతరబడి ఎదురుచూశారు. ఒక్కో రైతుకు ఒక బస్తా మాత్రమే ఇవ్వడంతో అసహనం వ్యక్తం చేశారు. యూరియా దొరకని రైతులు నిరాశతో వెనుదిరిగారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, సెప్టెంబరు 11

కుండపోత

పెద్దేముల్‌లో 65.3 మి.మీ వర్షపాతం

జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. చెరువులు, ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరుకోవడంతో అలుగు పారాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, పలు చోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షానికి వరద నీరు పోటెత్తడంతో పంటపొలాలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తాండూరు మండలం సంగెంకలాన్ శివారులోని దిడ్డి వాగులో ఓ వ్యక్తి గల్లంతు కాగా ఇప్పటికీ ఆచూకీ లభించలేదు. జిల్లాలో అత్యధికంగా పెద్దేముల్‌లో 65.3 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా పుట్టపహాడ్‌లో 7.3.మి.మీ వర్షం కురిసింది.

ఉప్పొంగిన వాగులు, వంకలు
అలుగెత్తిన చెరువులు, ప్రాజెక్టులు
పలుచోట్ల నిలిచిపోయిన రాకపోకలు
మేడ్చల్ జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షం



ధారూరు: రుద్రారం-నాగసముందర్ రోడ్డులో వంతెనపై ప్రవహిస్తున్న కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు నీరు



పెద్దేముల్: ఖానాపూర్‌లో నీట మునిగిన పత్తి చేను



జైరాంతండా సమీపంలో పొంగిపొర్లుతున్న వాడుక వాగు

(ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, వికారాబాద్ జిల్లా, సెప్టెంబరు 11): పెద్దేముల్ మండలం తట్టెపల్లి గ్రామ సమీపంలో ఉన్న వాగు ఉధృతంగా ప్రవహించింది. జహీరాబాద్ రోడ్డులో బండపల్లి-తట్టేపల్లి గ్రామాల మధ్య వాగు పొంగి ప్రవహించడంతో గంటకుపైగా వాహనాలు నిలిచిపోయాయి. జైరాంతండా-సిద్దన్నమడుగు తండా మధ్యన వాడుక ఉధృతంగా ప్రవహించడంతో పాఠశాల నుంచి ఇళ్లకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. గాజీపూర్ సమీపంలో ఓచెట్టు నేలకూలింది. కందనెల్లి, మన్‌సాన్‌పల్లి వాగులు ఉధృతంగా ప్రవహించాయి. యాలాల మండలంలో ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. ఎడతెరపి లేకుండా

మిగతా 6వ పేజీలో...



ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగును పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణ రెడ్డి



గాలింపు కోసం వెళ్లి నది వద్ద ఆగిన అధికారులు

దిడ్డి వాగులో వ్యక్తి గల్లంతు

తాండూరు మండలం సంగెంకలాన్ శివారులోని దిడ్డి వాగులో అదే గ్రామానికి చెందిన బొక్తంపల్లి మొగులప్ప(38) గల్లంతయ్యాడు. గురువారం సాయంత్రం కర్నాటకలోని చెట్టినాడు సిమెంటు కర్మాగారానికి పనికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో దిగ్గివాగు ఉధృతిలో గల్లంతయ్యాడు. గ్రామస్తులు గాలింపు చేపట్టినా ఫలితం లేకపోవడంతో డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్ తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన కలెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. రాష్ట్ర సరిహద్దులో ఘటన జరగడంతో ఎస్పీ నారాయణరెడ్డి కర్ణాటక పోలీసులకు సమాచారం ఇచ్చారు. అధికారులు సాయంత్రం వరకు గాలింపు చేపట్టి చీకటి పడటంతో శుక్రవారం ఉదయం గాలింపు చేపట్టనున్నట్లు తెలిపారు.

మేడ్చల్ జిల్లాలో..

ఘట్‌కేసర్ రూరల్/ఘట్‌కేసర్: ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలో గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షం పడింది. ముందు ముసురుతో ప్రారంభమైన వర్షం తరువాత దంచికొట్టింది. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా పలు చోట్ల వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. 15 రోజులుగా వర్షం జాడ లేక ఎండాకాలాన్ని తలపించింది. ఒక్కసారిగా నల్లటి మోఘాలు కమ్ముకొని వర్షం కురిసింది.



ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌లో కురుస్తున్న వర్షం

పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలి

» ట్రిపుల్‌ఆర్ నిర్మాణానికి మా భూములివ్వం

» కలెక్టరేట్ ఎదుట నవాబుపేట రైతుల ధర్నా



కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న రైతులు

వికారాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఆర్‌కు సంబంధించి పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలని నవాబుపేట రైతులు డిమాండ్ చేశారు. గురువారం వికారాబాద్ కలెక్టరేట్‌కు రైతులు పెద్దఎత్తున తరలివచ్చి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడా నేతల భూముల వెంచర్ల కోసమే ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చారని ఆరోపించారు. పాత రూట్ ప్రకారమే రహదారి కొనసాగించాలని, రైతుల పంట భూములను బలి చేయొద్దని కోరారు. అధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకొని పాత అలైన్‌మెంట్‌ను అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నవాబుపేట, చిట్టిగిద్ద, తదితర గ్రామాల రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



మాజీ సీఎంను కలిసిన మల్లారెడ్డి

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తన పుట్టినరోజును పురస్కరించుకొని మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. గురువారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్ బొకే అందించి మర్యాదపూర్వకంగా కలిశారు.

మేడ్చల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మార్కెట్ ఫోరం ప్రధాన కార్యదర్శిగా నర్సింలుయాదవ్

శామీర్‌పేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ రాష్ట్ర చైర్మన్ల ఫోరం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనట్లు కేశవరానికి చెందిన మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలుయాదవ్ గురువారం తెలిపారు. నూతనంగా కమిటీని ఎన్నుకున్నామని, తనను ఫోరం ప్రధాన కార్యదర్శిగా ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఫోరం అధ్యక్షుడు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా పని చేస్తానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల సహకారంతో మేడ్చల్ మార్కెట్‌ను విస్తరించేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే ఉమ్మడి శామీర్‌పేట మండలాన్ని, మేడ్చల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసేందుకు పాటుపడతానని పేర్కొన్నారు.



ఫోరం సభ్యులను అభినందిస్తున్న మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్

ఎవెన్యూ ప్లాంటేషన్‌కు స్థలాలను గుర్తించాలి

» జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్

వికారాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున ఎవెన్యూ ప్లాంటేషన్‌కు అనువైన స్థలాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటాలని జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ ఆదేశించారు. గురువారం అటవీ శాఖ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు జిల్లా వ్యాప్తంగా ఐదు రేంజ్‌ల ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు అమరవీరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కల సంరక్షణ, పరిరక్షణకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్లాంటేషన్ పూర్తయిన తర్వాత జిల్లాలోని వివిధ నర్సరీల్లో మిగిలిన మొక్కల సంరక్షణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్, ధారూరు, తాండూరు, పరిగి, కొడంగల్ రేంజ్ ఆఫీసర్లు శ్యాంకుమార్, రాజేందర్, శ్రీదేవి సరస్వతి, ప్రతిమ, సవిత, ఆయా రేంజ్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

మిల్లులు 30.. బకాయిలు రూ.20 కోట్లు

సర్కార్ ధాన్యం పక్కదారి

సివిల్ సప్లయి శాఖకు ఇవ్వకుండా దందా

నోటీసులు జారీ చేసిన అధికారులు

తాండూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసి బియ్యంగా మార్చేందుకు మిల్లర్లకు అలాట్ చేస్తే మిల్లర్లు వాటిని పక్కదారి పట్టించారు. రెండేళ్లుగా ఈ తంతును కొనసాగిస్తూ బిజినెస్‌ను రొటేషన్ చేసుకున్నారు. జిల్లాలో సుమారు 30 మిల్లర్లు రూ.20 కోట్ల మేరకు సివిల్ సప్లై శాఖకు బకాయి పడ్డారు. బకాయి పడ్డ మిల్లర్లకు ఆ శాఖ నోటీసులు జారీ చేసింది. విజిలెన్స్ అధికారుల నామమాత్రపు తనిఖీలతో మిల్లర్లకు అక్రమంగా ధాన్యం విక్రయించే అవకాశం ఏర్పడిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండేళ్లుగా వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి సుమారు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బియ్యంగా మార్చేందుకు దాదాపు 60 రైస్ మిల్లులకు కేటాయించింది. వాటిలో రబీ సీజన్‌కు వచ్చే బియ్యాన్ని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు

మిగతా 6వ పేజీలో...



యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌లోని కృష్ణ సాయి రైస్ ఇండస్ట్రీస్

మిల్లింగ్‌కు నిబంధనలివి..

ధాన్యాన్ని మిల్లింగ్ చేసేందుకు మిల్లర్లతో పౌర సరఫరాల శాఖ ఒప్పందం చేసుకుంటుంది. క్వింటాలు ధాన్యానికి 67 కిలోల బియ్యాన్ని సివిల్ సప్లయ్‌కు కేటాయించవలసి ఉంటుంది. ఈ క్రమంలో వచ్చే నూకలు, వరి పొట్టును మిల్లర్లే తీసుకుంటారు. బియ్యం ట్రాన్స్‌పోర్ట్ డబ్బులను పౌర సరఫరాల శాఖ చెల్లిస్తుంది. ఎప్పటికప్పుడు బియ్యం సరఫరా చేస్తున్న సమయంలో మిల్లర్లు పౌరసరఫరాల శాఖకు లెక్కలు చూపించాల్సి ఉంటుంది. ధాన్యం అలాట్ చేసేందుకు మిల్లర్లు షూరిటీతోపాటు డిపాజిట్‌ను చెక్కుల రూపేనా సివిల్ సప్లై శాఖకు వివరాలు సమర్పిస్తారు. నిబంధనలను అనుసరించి ఈ ఒప్పందం కొనసాగుతుంది. రైస్ మిల్లర్ల అసోసియేషన్ కూడా ఇందుకు మధ్య వర్తిత్వం వహిస్తుంది.



బాధ్యత అధికారులదే..

నాకు రైస్ మిల్లు వ్యాపారంతో అనుభవం లేదు. లీజుదారులను నమ్మి మిల్లు కేటాయించినందుకు, ఎలాంటి తప్పు లేకున్నా నాపై కేసు నమోదైంది. సివిల్ సప్లై అధికారులు ధాన్యాన్ని మిల్లర్లకు అలాట్ చేసేటప్పుడు, తిరిగి బియ్యం గోదాంకు పంపిస్తున్నారా, లేదా అని పర్యవేక్షించాలి. మిల్లర్లకు కేటాయించిన వరి ధాన్యం మిల్లింగ్ జరిగిందా, లేదా? అనే విషయాన్ని గమనించాల్సిన బాధ్యత అధికారులదే.

- రవిగౌడ్, డీసీసీబీ వైస్ చైర్మన్



మాట్లాడుతున్న రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిది

» రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

వికారాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆహార భద్రత కమిషన్ రాష్ట్ర చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జాతీయ ఆహార భద్రత చట్టం 2013 అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కమిషన్ సభ్యులు భారతి, శారద, ఆనంద్ హాజరయ్యారు. వివిధ శాఖలు ఇచ్చిన నివేదికలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు చౌక ధర దుకాణాల ద్వారా అందిస్తున్న సన్నబియ్యం తూనికల్లో తేడాలు రాకుండా చూడాలన్నారు. రేషన్ షాపుల వద్ద ఫిర్యాదుల పట్టిక, అధికారుల ఫోన్ నంబర్లు, పనిచేసే వేళలు సూచించేలా ఫ్లెక్సీలు ప్రదర్శించేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీల్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని, విద్యా, నిఘా కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్షచౌదరి, డీఆర్‌ఓ మంగీలాల్, ఆర్డీఓ వాసుచంద్ర, డీఆర్‌డీఏ శ్రీనివాస్, పౌర సరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, డీఎంహెచ్‌వో లలితాదేవి, డీడబ్ల్యూవో కృష్ణవేణి, డీఈఓ రేణుకాదేవి, ఫుడ్ సెక్యూరిటీ అధికారి జగన్నాథ్ పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలి

పరిగి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు ఇచ్చే పింఛన్లను రూ.4వేలకు పెంచాలని ఎమ్మార్పీఎస్ పరిగి ఇన్‌చార్జి జి.రవికుమార్ కోరారు. ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ల కార్యాలయాల ముట్టడి విజయవంతానికి గురువారం పరిగిలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు.

సైబర్ దాడుల ముప్పును సమష్టిగా ఎదుర్కొందాం

» కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపు



హైదరాబాద్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): దేశంలో డిజిటల్ విప్లవం కొనసాగుతున్న సమయంలో సైబర్‌దాడుల ముప్పు పెరుగుతుందని, దీన్ని సమష్టిగా ఎదుర్కొందామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. రామంతపూర్‌లోని సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(సీడీటీఐ)లో జరిగిన నేషనల్ పోలీసు హ్యాకథాన్ సైఫర్‌కాప్ 2025 అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీడీటీఐ త్రైమాసిక పత్రిక హోరిజన్‌ను అవిష్కరించి, హ్యాకథాన్ విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందచేశారు. సైబర్ సెక్యూరిటీ, సైబర్ నేరాల డైనమిక్ సవాళ్లను ఎదుర్కొవడం సమాజం ముందున్న ప్రధాన కర్తవ్యమని, వీటిని ఎదుర్కొవడంలో అందరు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

జైలు అధికారులే కీలకం

ఖైదీల జీవితాల్లో మార్పు తీసుకురావడంలో జైలు అధికారుల పాత్ర కీలకమని కేంద్ర మంత్రి బండి సంజయ్ చెప్పారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో జరిగిన 7వ ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీ మీట్-2025 ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్యూటీ మీట్‌లో పలు విభాగాల్లో తెలంగాణ జైళ్ల శాఖ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మొదటిస్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. అనంతరం ఆయా విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఆయన మెడల్స్, ట్రోఫీలు అందించారు. తెలంగాణ జైళ్ల శాఖ సొంతం చేసుకున్న ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్ ట్రోఫీని జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా అందుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తెలంగాణ విధానాల్ని దేశ వ్యాప్తంగా అమలు చేయాలన్నారు. తెలంగాణలో జాతీయ ప్రిజన్ అకాడమీ ఏర్పాటుకు సహకరించాలని బండి సంజయ్‌ను సౌమ్యా మిశ్రా కోరారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక జైళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామని బీపీఆర్‌డీ అదనపు డీజీ రవి జోసెఫ్ లోకూర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హోం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవి గుప్తా, డీజీపీ జితేందర్, జాతీయ పోలీస్ శిక్షణా కేంద్రం డైరెక్టర్ అమిత్ గార్గ్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జైళ్ల శాఖ ప్రతిభ

7వ ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీ మీట్‌లో అత్యధిక ట్రోఫీలు, మెడల్స్ సాధించి తెలంగాణ జైళ్ల శాఖ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. మొత్తం 28 పతకాల్లో బంగారం-21, వెండి-4, కాంస్యం-3 ఉన్నాయి.

2017లోనే చిరునామా మార్పునకు ఫామ్-6 సమర్పణ : కోట నీలిమ

తనకు రెండు ఓటరు గుర్తింపు కార్డులు ఉన్నాయని స్వతంత్ర సంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) నోటీసు ఇవ్వడమేమిటని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ ప్రశ్నించారు. ఓటరు గుర్తింపు కార్డులో తన చిరునామాను మార్చాలని కోరుతూ ఎన్నికల సంఘానికి 2017లోనే ఫామ్-6 ఇచ్చామని, దానికి ఈసీ అక్‌నాలెడ్జ్ కూడా ఇచ్చిందని గురువారం గాంధీభవన్‌లో మీడియాకు చెప్పారు. ఫామ్-6 సమర్పించిన తర్వాత కూడా తన చిరునామా మార్చని ఈసీ, రెండు ఓటరు గుర్తింపుకార్డులున్నట్లు నోటీసులివ్వడమేమిటన్నారు.

గ్రూప్-1 పరీక్ష మళ్లీ నిర్వహించాల్సిందే

హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు.. సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామాకు డిమాండ్

» ఓయూ సహా పలుచోట్ల బీఆర్ఎస్వీ ఆందోళనలు, పలువురి అరెస్టు


బీఆర్ఎస్వీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ, చిక్కడపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): హైకోర్టు తీర్పు నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షను మళ్లీ నిర్వహించాల్సిందేనని బీఆర్ఎస్వీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్రంథాలయం, హైదరాబాద్, చిక్కడపల్లిలోని కేంద్ర గ్రంథాలయం వద్ద వారు గురువారం ఆందోళనకు దిగారు. ఇందులో భాగంగా ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ముఖ్యమంత్రి ఫొటోలను చింపేశారు. గ్రూప్-1 పరీక్ష నిర్వహణలో టీజీపీఎస్సీ విఫలమైనందుకు నైతిక బాధ్యతగా సీఎం రేవంత్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనల్లో పాల్గొన్న పలువురు బీఆర్ఎస్వీ నేతలను పోలీసులు అరెస్టు చేసి వేర్వేరు పోలీసుస్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు గెల్లు శ్రీనివాస్, తుంగ బాలు మాట్లాడుతూ గ్రూప్-1 అంశంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని వ్యాఖ్యానించారు. గ్రూప్ 1 పరీక్షను రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని లేని పక్షంలో తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. గ్రూప్-1 పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. పరీక్షల్లో అవకతవకలు చోటు చేసుకోవడంతో అభ్యర్థులు నిరుత్సాహానికి లోనవడంతో పాటు మానసికంగా కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 29 ద్వారా చేపట్టిన నియామకాల వల్ల రిజర్వేషన్లలో అన్యాయం జరుగుతోందని నిరసనలు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం లాఠీ చార్జీలు చేస్తుందని ధ్వజమెత్తారు.

మంత్రులు, సీఎంవో నుంచి గ్రూప్-1 పోస్టుల అమ్మకం : కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పోస్టుల కోసం ప్రభుత్వ పెద్దలు భారీగా డబ్బులు డిమాండ్ చేసినట్లు నిరుద్యోగులు చెబుతున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. మంత్రులు, సీఎంవో నుంచే గ్రూప్-1 పోస్టులను కోట్ల రూపాయలకు అమ్ముకున్నారనే విమర్శలు ఉన్నాయని తెలిపారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం గ్రూప్ 1 పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే, పరీక్షల్లో జరిగిన అవకతవకలపై జ్యుడిషియల్ కమిషన్‌తో విచారణ చేపట్టి ఉద్యోగాలు అమ్ముకున్న దొంగలెవరో తేల్చాలని కోరారు. పరీక్షల నిర్వహణలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వాన్ని యువత ఎప్పటికీ క్షమించదని కేటీఆర్ పేర్కొన్నారు. ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాలు స్తామన్న కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానంపై ప్రత్యేక అసెంబ్లీ సెషన్ ఏర్పాటు చేసి చర్చించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇక, బీఆర్ఎస్వీ నాయకుల అరెస్టును బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఖండించారు. ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను రెచ్చగొట్టిన రేవంత్‌రెడ్డి తన అసమర్థతను ఒప్పుకొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 అవకతవకలపై వెంటనే సమగ్ర దర్యాప్తు చేపట్టాలన్నారు.

సిమ్ బాక్స్ ముఠా అరెస్టు

» అంతర్జాతీయ కాల్స్‌ను.. లోకల్ కాల్స్‌గా మారుస్తున్న ముఠా
» హాంగ్‌కాంగ్‌లో సూత్రధారి వెన్నీసా..

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే అంతర్జాతీయ ఫోన్‌కాల్స్‌ను రిసీవ్ చేసుకోవద్దని, మోసగాళ్ల ఉచ్చులో చిక్కుకోవద్దని కేంద్ర,రాష్ట్ర సంస్థలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు తమ పంథాను మార్చారు. అంతర్జాతీయ కాల్స్‌ను స్థానిక కాల్స్‌గా మార్చే సాంకేతికతను వాడుతూ సిమ్ బాక్స్ డంపింగ్ ద్వారా ఎర వేయడానికి సన్నద్ధమయ్యారు. హాంగ్‌కాంగ్‌లో ఉన్న సైబర్ నేరగాళ్ల ముఠాలోని సూత్రధారి వెన్నీసా అనే మహిళ ద్వారా హైదరాబాద్, చాంద్రాయణగుట్టలలో సిమ్ బాక్స్ ఏర్పాటు చేసిన హిదయతుల్లా, అతనికి వందలాది సిమ్ కార్డులు ఇచ్చిన మరో ఇద్దర్ని సైబర్ సెక్యూరిటీ, కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖాధికారులు సంయుక్త ఆపరేషన్‌లో పట్టుకున్నారు. కార్ల వ్యాపారం చేసే హిదయతుల్లా అందులో నష్టం రావడంతో స్నాప్‌చాట్ ద్వారా పరిచయమైన ఒక వ్యక్తిని సంప్రదించాడు. అతనిచ్చిన సలహా మేరకు ఒక ట్రేడింగ్ యాప్‌లో రూ.16లక్షలు పెట్టుబడి పెట్టి మళ్లీ నష్టపోయాడు. దీంతో సదరు అగంతకుడు హిదయతుల్లాకు వాట్సాప్ ద్వారా హాంగ్‌కాంగ్‌లో ఉన్న వెన్నీసా అనే మహిళను పరిచయం చేశాడు. తమకు సాయం చేస్తే డబ్బు వచ్చేలా చేస్తామని వెన్నీసా పేర్కొనడంతో హిదయతుల్లా ఒప్పుకున్నాడు. ఒక సిమ్ బాక్స్‌ను పంపిస్తామని, స్థానికంగా సిమ్ కార్డులు సేకరించి, వైఫై కనెక్షన్ తీసుకుని దాని ఆపరేషన్ తమకు అప్పగించాలని వెన్నీసా సూచించడంతో హిదయతుల్లా సరే నన్నాడు. అతడికి కొరియర్ డెలివరీ బాయ్ ద్వారా అతనికి సిమ్ బాక్స్ అందింది. సిమ్‌కార్డుల కోసం వివిధ టెలికం కంపెనీల్లో పనిచేస్తున్న అహ్మద్‌ఖాన్, షోయబ్‌లను హిదయతుల్లా సంప్రదించాడు, వారు అందించిన 500 సిమ్ కార్డుల్లో 200 కార్డులను సిమ్ బాక్స్‌లో వేసి దాన్ని వెన్నీసా సూచించినట్లు హిదయతుల్లా పని చేయడం ప్రారంభించాడు. సైబర్ సెక్యూరిటీ బ్యూరోకి అందిన ఫిర్యాదు ఆధారంగా రంగంలో దిగిన పోలీసు బృందాలు చాంద్రాయణగుట్ట నుంచి విదేశీ కాల్స్ రూట్ అవుతున్నట్లు గుర్తించి హిదయతుల్లాతో పాటు సిమ్‌లు అందచేసినవారిని పట్టుకున్నారు. వెన్నీసా గురించి దర్యాప్తు జరుపుతున్నామని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అదనపు డైరెక్టర్ అనురాగ్ తెలిపారు.

గొర్రెల స్కాం కేసులో ఈడీ దూకుడు

బాధితులను విచారించేందుకు నోటీసులు జారీ

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గొర్రెల కొనుగోలు, బిల్లుల చెల్లింపు గోల్‌మాల్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వేగం పెంచింది. గొర్రెల స్కాంకు సంబంధించి ముందుగా కొందరు బాధితులు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా ఏసీబీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. పెద్ద మొత్తంలో అక్రమాలు జరిగినట్లు తేలడంతో నిందితులుగా ఉన్న ప్రస్తుత, మాజీ ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులను అరెస్ట్ చేసింది. ఏసీబీ కేసు ఆధారంగా మనీ లాండరింగ్ కోణంలో ఈడీ విచారణ కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ కేసులో బాధితులుగా ఉన్న వారిని విచారించి వాంగ్మూలం నమోదు చేసేందుకు ఈడీ హైదరాబాద్ జోనల్ అధికారులు సిద్ధమయ్యారు. ఏసీబీ నుంచి సేకరించిన వివరాల ఆధారంగా బాధితులకు నోటీసులు జారీ చేసి ఈ నెల 15న విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. మొదటి దశలో బాధితులను విచారించిన అనంతరం రెండో దశలో ఈ కేసులో ఏసీబీ అరెస్ట్ చేసిన వారికి సైతం నోటీసులు జారీ చేసి ప్రశ్నించేందుకు ఈడీ అధికారులు సిద్ధమవుతున్నారు.

వ్యవస్థాగత లోపాలు సరిదిద్దకుండా గురుకుల ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసులా?

తెలంగాణ గురుకులాల ప్రిన్సిపాళ్ల సంఘం ఖండన

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వ్యవస్థాగత లోపాలు సరిదిద్దకుండా ప్రిన్సిపాళ్లను బాధ్యులను చేయడం సరి కాదని తెలంగాణ గురుకులాల ప్రిన్సిపాళ్ల సంఘం (టీజీపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ కుమార్ రౌతు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు, కాలేజీల్లో పూర్తిస్థాయిలో విద్యార్థుల ప్రవేశాలు నిర్వహించలేదని, విద్యార్థులు తగ్గారంటూ రాష్ట్ర వ్యాప్తంగా 170 మైనారిటీ గురుకులాల ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసు ఇవ్వడాన్ని ఖండించారు. ఎక్కువ గురుకుల పాఠశాలలు/ కాలేజీలు పెట్టి 100 శాతం ప్రవేశాలు చేయాలని కోరడం సబబు కాదని పేర్కొన్నారు.

గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డా.వాణి నియామకం

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాణిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం అదనపు వైద్య విద్య సంచాలకులుగా ఉన్న ఆమే, గతంలో మెడికల్ ఎడ్యుకేషన్‌కు ఇన్‌చార్జి డైరెక్టర్‌గా, సంగారెడ్డి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించారు. శుక్రవారం సూపరింటెండెంట్‌గా బాధ్యతలను స్వీకరించనున్నారు. కాగా, గత సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారిపై ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు అందాయి. ఆమె బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆసుపత్రి పాలన గందరగోళంగా మారిందన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో రాజకుమారిపై సర్కారు వేటు వేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు గాంధీ మెడికల్ కాలేజీలోనే ఫిజియోలజీ ప్రొఫెసర్‌గా కొనసాగుతారని హెల్త్ సెక్రటరీ క్రిస్టినా చోంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రమాదాల నివారణకు.. చర్యలు తీసుకోవాలి


ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు శివ, పవన్‌గౌడ్, శ్రీకాంత్ తదితరులు

శామీర్‌పేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట వద్ద రాజీవ్ రహదారిపై, నల్సార్‌కు వెళ్లే రోడ్డులో నిత్యం జరుగుతున్న ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని శామీర్‌పేట మండల నాయకులు మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం నాయకులు శివ, పవన్‌గౌడ్, విష్ణు, శ్రీకాంత్, కిరణ్‌లు ఎంపీ రాజేందర్‌ను క్యాంప్ కార్యాలయంలో కలిసి రాజీవ్ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. రాజీవ్ హైవేపై సరైన సిగ్నల్స్, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు లేక నిత్యం ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు పోతున్నాయని, మరెందరో వికలాంగులుగా మారుతున్నారని ఎంపీకి చెప్పారు. ఈ హైవేపై ప్రమాదాలపై ఆయన వెంటనే స్పందించి చర్యలను తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఎంపీ స్పందిస్తూ.. శామీర్‌పేట వద్ద రాజీవ్ రహదారిపై ప్రమాదాల నివారణకు తాను హైవే అథారిటీ అధికారులతో మాట్లాడతానని, తగిన చర్యలను తీసుకునేలా కృషి చేస్తానని చెప్పారు. అవసరమైన నిధులను ఎంపీ కోటా నుంచి మంజూరు చేస్తానని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పేట్ బషీరాబాద్ ఏసీపీకి ఎంపీ ఫోన్ చేశారు.

మునిసిపల్ కమిషనర్‌కు వినతి

బీజేపీ నాయకులు తూంకుంట మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్ జ్యోతికి వినతిపత్రం ఇచ్చారు. రాజీవ్ హైవేపై ప్రయాణికులు రోడ్డు దాటేటప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ప్రమాదాలు జరుగకుండా మునిసిపాలిటీ నుంచి నిధులు కేటాయించి అవసరమైన సర్వీస్ రోడ్లను, సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. యాక్సిడెంట్ స్పాట్లలో సిబ్బందిని ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రుణమాఫీ చేయాలంటూ రైతుల రిలే దీక్ష

● రైతులతో చర్చించిన జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ

ఘట్‌కేసర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మండల రైతులకు వెంటనే పంటల రుణమాఫీ చేయాలని రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం రెండో రోజుకు కొనసాగింది. రైతులు, రాజకీయ నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని రెండేళ్లయినా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్ సొసైటీలో 1,190 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారని, వారిలో ఒక్కరికి కూడా రుణమాఫీ చేయలేదన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే దీక్ష వద్దకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రకళ వచ్చి చర్చించారు. రుణమాఫీ కోసం రైతులు జాబితాను ప్రభుత్వానికి పంపామని తెలిపారు. నాలుగో విడతలో మిగిలిపోయిన రైతులందరికీ రుణమాఫీ వర్తించే అవకాశముందని చెప్పారు. ఆమెతో ఏడీఏ వెంకట్‌రాంరెడ్డి, ఏఓ లావణ్య, ఏఈవో జగదీష్ ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కేంద్రం పెద్దపీట


ఆలూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, స్థానికులు

● చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆలూర్, తంగడ్‌పల్లి గ్రామాల్లో ఎంపీ నిధులతో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎంపీ ల్యాడ్స్‌తో సీసీ రోడ్లు, యూజీడీ పనులను చేపడుతున్నట్టు చెప్పారు. దశలవారీగా నిధులు మంజూరు చేయిస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం, జిల్లా, మండల నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎ.అనంతరెడ్డి, డాక్టర్ ఎం.వైభవ్‌రెడ్డి, ఆంజనేయులు, కృష్ణ, శ్రీనివాస్, ఇంద్రసేనారెడ్డి, జయసింహారెడ్డి, అల్లి శ్రీశైలం, నాగరాజు, వెంకట్‌రెడ్డి, ఆయా గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యంతరం తెలిపినా పోలింగ్ స్టేషన్ మార్చలేదు


పీఎస్ మార్చాలని కోరుతూ ఇచ్చిన వినతి పత్రం

ధారూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధారూరు పోలింగ్ స్టేషన్‌ను అనుకూలమైన చోటకు మార్చాలని అధికారులకు వినతిపత్రం ఇచ్చినా మార్చలేదని రాష్ట్ర ఎన్నికల సంఘం, కలెక్టర్‌లకు కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ బాబా ఖాన్ గురువారం ఫిర్యాదు చేశారు. అభ్యంతరాలపై ఈ నెల 8న మండల పరిషత్‌లో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ధారూరు పోలింగ్ కేంద్రాన్ని బాలుర పాఠశాల నుంచి బాలికల పాఠశాలకు మార్చాలని కోరామన్నారు. ప్రస్తుత పోలింగ్‌స్టేషన్ గ్రామానికి దూరంగా ఉందని తెలిపారు. సౌకర్యంగా ఉన్న బాలికల పాఠశాలకు మార్చాలని వినతి పత్రం ఇచ్చామన్నారు. తమ అభ్యంతరాన్ని పరిగణలోకి తీసుకోలేదన్నారు. దీంతో ఎస్ఈసీ, కలెక్టర్‌లకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఓటరు జాబితాలో తప్పుల సవరణపై అభ్యంతరాలను అధికారులు పట్టించుకోలేదని నాయకులు మండిపడుతున్నారు.

రైతులను ఆదుకోని ప్రభుత్వం గద్దె దిగాలి


శుభప్రద్ పటేల్

పెద్దేముల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియా అందించడం లేదని, రైతులను ఆదుకోని ప్రభుత్వం గద్దె దిగాలని రాష్ట్ర బీసీ కమీషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ డిమాండ్ చేశారు. గురువారం మాట్లాడుతూ.. పెద్దేముల్, యాలాల మండలాల్లో రైతులు యూరియా కోసం వర్షంలో ఇబ్బందులు పడిన పరిస్థితులను సోషల్ మీడియాలో చూసి చలించిపోయానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అన్నదాతలు పంటల సాగుకు పడరాని పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క బస్తా యూరియా కోసం వర్షంలో నిలబెట్టడం సిగ్గుచేటన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ యూరియా కష్టాలు రాలేదన్నారు. ఇప్పటికైనా రైతులకు సరిపడా యూరియా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎస్టీల సంక్షేమానికి పెద్దపీట

ఆమనగల్లు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండలం పల్లెచెలక తండాకు రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన సంస్థ ద్వారా నిధులు మంజూరైనట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, ఇతర వసతుల కల్పనకు రూ.కోట్లు మంజూరుకు ప్రతిపాదనలు పంపగా మొదటి విడత రూ.కోటి విడుదల చేశారని పేర్కొన్నారు. పల్లె చెలక తండా వాసులు గురువారం టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివా‌స్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివా‌స్‌రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు రమేశ్‌నాయక్‌లతో ఎమ్మెల్యేను హైదరాబాద్ లో కలిశారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. తండా అభివృద్ధికి నాయకులతో ఎమ్మెల్యే మాట్లాడారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అన్ని తండాలకు బీటీ రోడ్లు వేస్తామని నారాయణరెడ్డి చెప్పారు. అన్ని తండా పంచాయతీలకు భవనాలు నిర్మిస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గం అన్నిరంగాల్లో ప్రగతి సాధిస్తోంద న్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిక్యానాయక్, ప్యాక్స్ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ రాములు, నాయకులు రమేశ్‌నాయక్, నర్సింహనాయక్, శ్రీను, సీతారామ్, దీప్లా, బాల్‌దాస్, మన్య, మోతీలాల్, రవీందర్, గోపి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నారాయణరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కమలమ్మకు ఎమ్మెల్యే పరామర్శ

ఆమనగల్లుకు చెందిన జూలూరి కమలమ్మ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి గురువారం ఆసుపత్రికి చేరుకొని కమలమ్మను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆమె కుమారులు జయప్రకాశ్, రమేశ్, అశోక్, గోపాల్, సురేశ్‌లను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని కమలమ్మకు మనోధైర్యం చెప్పారు. మెరుగైన వైద్య సేవ అందించాలని వైద్యులకు సూచించారు.



గుండ్లపోచంపల్లిలో అక్రమంగా నిర్మిస్తున్న గోదాం

అక్రమ గోదాంలపై చర్యలు తీసుకోవాలి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ రెండో వార్డులో అక్రమంగా నిర్మిస్తున్న గోదాంలపై చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ శ్రీలతశ్రీనివా‌స్‌రెడ్డి, హెచ్ఎండీఏ అధికారులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పూడూరులో సర్వే నంబర్లు 439/2, 440, 441, 44లలో కొందరు అనుమతి లేకుండా గోదాంలు కడుతున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని, అందుకే హెచ్ఎండీఏ, కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

స్పీకర్‌ను విమర్శించే స్థాయి ఆనంద్‌కు లేదు

మర్పల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు లేదని కాంగ్రెస్ నాయకులన్నారు. మర్పల్లి మార్కెట్ యార్డులో గురువారం విలేకరులతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్, నాయకులు కృష్ణారెడ్డి, రవీందర్, రామేశ్వర్, రఫియొద్దీన్‌లు మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసమే ఆనంద్ చీటికి మాటికి స్పీకర్‌ను విమర్శిస్తున్నారని, ఇలాంటి చర్యలను సహించేది లేదని హెచ్చరించారు. పదేళ్లలో జరగని అభివృద్ధిని రెండేళ్లలోనే చేసి చూపామన్నారు. అర్హులందరికీ ప్రభుత్వం రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేసిందన్నారు. సమావేశంలో నాయకులు నాగేశ్, దివాకర్, సురేశ్, సంజీవరెడ్డి, జగదీశ్వర్, ఈశ్వర్, పాండురంగారెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.



ఏఐ క్లౌడ్‌బూట్ క్యాంప్‌లో విద్యార్థులు, అధ్యాపకులు

అనురాగ్‌లో ఏఐ క్లౌడ్‌బూట్ క్యాంప్

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్‌లోగల అనురాగ్ యూనివర్సిటీలో గురువారం గూగుల్ క్లౌడ్, హ్యాక్ టు స్కిల్ సహకారంతో గూగుల్ ఏఐ క్లౌడ్‌బూట్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపును రెండు సెషన్లలో నిర్వహిస్తున్నామని డీన్ విజయ్‌కుమార్ తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ డొమైన్‌పై సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. 400మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీన్ విష్ణుమూర్తి, బూట్‌క్యాంప్ కో-ఆర్డినేటర్లు సిద్ధార్థ్ ఘోష్, తరానాసింగ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాల గురించి గురువారం షీటీం బృందం సభ్యులు అవగాహన కల్పించారు. పట్టణంలోని విజ్ఞాన్ కళాశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. ఆపదలో ఉంటే 1098కు ఫోన్ చేయాలన్నారు. సైబర్ నేరాలపై కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైతే 1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో షీటీం సిబ్బంది సురేష్ కుమార్, శ్రీకాంత్ గౌడ్, వెంకటేష్, ప్రిన్సిపాల్ భవానీ శంకర్ ఉన్నారు.

జిల్లా స్థాయి 69వ ఎస్‌జీఎఫ్ టోర్నీకి ఎంపిక

బంట్వారం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులు 69వ ఎస్‌జీఎఫ్ టోర్నమెంట్‌లో ప్రతిభ చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ గురువారం తెలిపారు. మర్పల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన క్రీడల్లో తమ స్కూల్ బాలికలు వాలీబాల్‌లో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారన్నారు. అండర్-17లో మహేశ్వరి, గాయత్రి, సంధ్య, అండర్-14లో శ్రీనవ్య, భవిత, నందిని, శ్రీవాణి జిల్లా పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థినులను కేజీబీవీ టీచర్లు అభినందించారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా కేసు.. ఎయిర్‌పోర్టులో

మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అరెస్టు

మునావర్‌ను కువైట్ నుంచి హైదరాబాద్‌కు రప్పించిన సీబీఐ

ఫిబ్రవరి 2న రెడ్ కార్నర్ నోటీసులు జారీ



మునావర్ ఖాన్

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ బరోడా మోసం చేసిన కేసులో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ మహ్మద్ మునావర్ ఖాన్‌ను గురువారం శంషాబాద్ విమానాశ్రయంలో సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. 2011లో చెన్నైలో బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్‌లో ఆరు ప్రాంతానికి చెందిన మునావర్‌ఖాన్ నకిలీ పత్రాలు సృష్టించి కోట్లాది రూపాయలు కొల్లగొట్టి కువైట్‌కు పరారయ్యాడు. అప్పట్లో సీబీఐ అధికారులు కువైట్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో విచారణ అనంతరం కువైట్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. 2011 నుంచి తప్పించుకుంటున్న మునావర్‌ను కువైట్ పోలీసుల సహకారంతో సీబీఐ అరెస్టు చేసి ఇండియాకు రప్పించింది. గురువారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరిన అతడిని సీబీఐ అరెస్టు చేసి చెన్నైకి తరలించింది. కాగా మునావర్‌పై గత ఫిబ్రవరి 2న దేశంలోని అన్ని ఎయిర్‌పోర్టుల్లో రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసింది.

సీఎం రేవంత్‌ను కలిసిన శ్రీను



ఆమనగల్లు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా నాయకుడు, పద్మశాలి సంఘం రాష్ట్ర నేత అప్పం శ్రీను గురువారం ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉన్నత విద్యకు యూకేకు వెళ్తున్న అప్పం శ్రీను కూతురు అప్పం రుషితను ఈ సందర్భంగా సీఎం ఆశీర్వదించారు.

పద్మనాభ స్వామిని దర్శించుకున్న గోలి

ఆమనగల్లు, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి):వికారాబాద్ జిల్లా అనంతపద్మనాభస్వామి ఆలయాన్ని గురువారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివా‌స్‌రెడ్డి దర్శించుకున్నారు. కమిషన్ సభ్యులతో కలిసి స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్ రెడ్డిని సన్మానించారు. ఆలయ నిర్వాహకులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



గోలి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

రైతులను వీడని యూరియా కష్టాలు



పెద్దేముల్ : బారులు తీరిన రైతులు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, సెప్టెంబరు 11: యూరియా కోసం రైతులు పలు అగచాట్లు పడుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో రైతులకు యూరియా కష్టాలు అధికమయ్యాయి. డిమాండ్‌కు అనుగుణంగా యూరియా లభ్యం కాక ఇక్కట్లు తప్పడం లేదు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది యూరియా కష్టాలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పనులు మానుకుని యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. గురువారం ఉమ్మడి జిల్లాలో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడ్డారు.

కులకచర్లలో ఎస్సై కాళ్లు మొక్కిన రైతు



కులకచర్లలో యూరియా కోసం ఎస్సై కాళ్లు మొక్కుతున్న రైతు

కులకచర్ల చౌరస్తాలో యూరియా కోసం రైతులు ధర్నా చేశారు. తనకు యూరియా ఇప్పించాలని ఓ రైతు ఎస్సై కాళ్లు మొక్కాడు. యాలాల, పెద్దేముల్ సొసైటీకి 220బస్తాల యూరియా వచ్చింది. ఇది యమే 300మంది రైతులు బారులు తీరారు. 9గంటలకు వర్షం కురియగా వానలోనే నిలబడ్డారు. ఒక్కొక్కరికి ఒక్కోబస్తా ఇచ్చారు. అందని వారికి స్లిప్పులు రాసిచ్చారు. మోమిన్‌పేట్‌లో సొసైటీ కార్యాలయం ఎదుట టోకెన్ల కోసం చెప్పులను లైన్లోపెట్టి ఎదురు చూశారు. పూడూరు మండలం చెన్గోముల్ రైతు వేదిక వద్ద క్యూలో నిలబడ్డారు. ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున ఇచ్చారు. యాలాలలో వ్యవసాయ కార్యాలయం వద్ద యూరియా కోసం రైతులు లైన్లో నిలబడ్డారు. దారూరు మండలం రుద్రారం-నాగసమందర్‌ల మధ్య ఉన్న అలుగు పొంగడంతో దారూరు ప్యాక్స్ సిబ్బంది నాగసమందర్‌కు వెళ్లలేకపోయారు. దీంతో అక్కడ యూరియా సరఫరా నిలిచింది.కోట్‌పల్లికి లారీలో వచ్చిన యూరియా బస్తాల్ని దింపాలంటూ రైతులు ఆందోళనకు దిగారు. యూరియా బస్తాలను కింద పడవేశారు. ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుల ప్రోద్బలంతోనే ఇలా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రంగారెడ్డి జిల్లాలో...

యాచారంలో సొసైటీ కార్యాలయం వద్ద యూరియా పంపిణీ చేశారు. రైతులకు ఏసీపీ కేపీవీ రాజు, సీఐ ఎనదీశ్వర్‌రెడ్డి, ఎస్సై ప్రియాంక స్లిప్‌లు పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు రెండు బస్తాలు ఇచ్చారు. రైతులకు వెంటనే యూరియా అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంచాలలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ ప్రసాద్‌రావుకు వినతి పత్రం ఇచ్చారు. రైతుల ఇబ్బందులను అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. నాయకులు ఎం.బాలయ్య, ఎస్.శ్రీనివాస్, చంద్రయ్య, పి.నీలమ్మ, బి.ఆలివేలమ్మ, ఎల్.అనంతరెడ్డి, రాజు, బి.బాలయ్య, ఎస్.బాల్‌రెడ్డి, నరేందర్, వెంకటేశ్, రామకృష్ణ పాల్గొన్నారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడకుండా సొసైటీ ద్వారా సక్రమ పద్ధతిలో పంపిణీ చేయడం అభినందనీయమని మహేశ్వరం ఏసీపీ జానకిరెడ్డి అన్నారు. కందుకూరులో ఏవో లావణ్య, సీఐ సీతారాం ఆధ్వర్యంలో రెండు లారీల యూరియా పంపిణీ చేపట్టారు. ఏసీపీ చేరుకొని పర్యవేక్షించారు. ఎస్సైలు పరమేశ్, సురేశ్, సొసైటీ సీఈవో యాదగిరిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మాడ్గుల మండల రైతులకు యూరియా సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషకు మండల కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నూదిని శ్రీనివాస్‌రెడ్డి, జగన్ ఉన్నారు. చేవెళ్లలో యూరియా కోసం డీసీఎంఎస్ గోదాం వద్ద రైతులు బారులు తీరారు. 450 బస్తాల యూరియా రాగా ఏవో శంకర్‌లాల్, సొసైటీ సీఈవో వెంకటయ్య రైతులకు పంపిణీ చేశారు.



చేవెళ్లలోని డీసీఎంఎస్ గోదాం వద్ద యూరియా కోసం క్యూ



యాలాలలో వ్యవసాయ కార్యాలయం వద్ద వర్షంలోనే నిల్చున్న రైతులు



కందుకూరు : పంపిణీ వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏసీపీ జానకిరెడ్డి

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దు

» జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత



మాట్లాడుతున్న డీఆర్‌డీవో పీడీ శ్రీలత

కొందుర్గు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వన మహోత్సవంలో మొక్కలు నాటడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత అన్నారు. గురువారం కొందుర్గు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సామాజిక తనిఖీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పని కల్పించాలని సూచించారు. కూలీల డబ్బుల చెల్లింపులో ఆలస్యం జరగకుండా చెల్లించాలన్నారు. మస్టర్‌లను తనిఖీ చేయకుండా బిల్లులు ఇవ్వొద్దన్నారు. వనమహోత్సవంలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ మేరకు గ్రామాల్లో మొక్కలు నాటించాలన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌వో సుభాషిణి, సునీత, క్లస్టర్ ఏపీడీ చరణ్‌గౌతమ్, ఎంపీడీవో లక్ష్మీఅనురాధ, ఎంపీవో విజయకుమార్ పాల్, ఏపీవో నర్సింగ్ రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించాలి



ఆందోళనలో మాట్లాడుతున్న ఆచారి

మాడ్గుల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆన్నెబోయినపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో ట్రిపుల్‌ఆర్‌కు భూములు కోల్పోయే రైతులకు సరిపడా పరిహారమివ్వాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి అన్నారు. గురువారం మాడ్గులలో రైతులు రాస్తారోకో చేశారు. భూములు లాక్కొంటూ తమ నోట్లో మట్టికొడుతున్నారని రైతులు వాపోయారు. ట్రిపుల్‌ఆర్‌ను పాత అలైన్మెంట్ ప్రకారమే నిర్మించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. వారికి మద్దతుగా ఆచారి పాల్గొన్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఇస్తానంటున్న ఎకరానికి రూ.లక్షలు సరిపోవని, భూసేకరణ చట్టం ప్రకారం పరిహారమివ్వాలని డిమాండ్ చేశారు. రైతులు తహసీల్దార్‌కు వినయసాగర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు నరోత్తమ్‌రెడ్డి, ఎ.రాంరెడ్డి, సంజీవరెడ్డి, శివరాంరెడ్డి, వెంకటయ్య, శేఖర్, బీజేపీ మండల అధ్యక్షులు పెద్దయ్య, కాటంగౌడ్ పాల్గొన్నారు.


కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

» ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి



ఎంపీవోకు వినతి పత్రం ఇస్తున్న కార్మిక సంఘం నాయకులు, కార్మికులు

చౌదరిగూడ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మిక సంఘం నాయకులు, జీపీ కార్మికులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని ఎంపీవో హన్మంత్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు ప్రతినెల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుంటే కుటుంబాన్ని ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. కార్యక్రమంలో వీరేష్, రమేష్, యాదగిరి, తిర్మలేష్, శంకర్, పాపయ్య, జంగయ్య, పార్వతమ్మ, రాములమ్మ, నర్సమ్మ, సరళ, చెన్నమ్మ పాల్గొన్నారు.



నూతన కమిటీని సన్మానిస్తున్న దశరథ్‌నాయక్

20వేల మందితో బంజారాల బహిరంగ సభ

కడ్తాల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బంజారాల ఐలా చాటేలా కల్వకుర్తి నియోజకవర్గంలో త్వరలో 20వేల మందితో బహిరంగ సభ నిర్వహిస్తామని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. బంజారాలంతా ఏకమై స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కడ్తాల్ మండలం మైసిగండిలో గురువారం ఎల్‌హెచ్‌పీఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి నూతన కమిటీలను ఎన్నుకున్నారు. మైసిగండి పంచాయతీ ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడిగా ప్రవీణ్ కుమార్‌నాయక్, గానుమార్ల తండా అధ్యక్షుడిగా కిషన్‌నాయక్, పెద్దవేములోనిబాయి తండా అధ్యక్షుడిగా క్యారె శ్రీనునాయక్, గడ్డమీది తండా అధ్యక్షుడిగా శ్రీనునాయక్‌లు ఎన్నికయ్యారు. అనంతరం దశరథ్ మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గ జనాభాలో 35శాతం ఉన్న బంజారాలు ఏకమైతే ఎన్నికలైనా విజయం మనదేనన్నారు. అన్ని గ్రామాల్లో ఎల్‌హెచ్‌పీఎస్ కమిటీలను నియమించి బహిరంగసభ నిర్వహిస్తామన్నారు. వివిధ రాష్ట్రాల ప్రముఖులను ఆహ్వానిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తులసి రామ్‌నాయక్, శ్యాం భూనాయక్ డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ శారద పాండు, రమణానాయక్, నాయకులు శ్రీను, లక్ష్మణ్ నాయక్, సోమ్లానాయక్, భీమానాయక్, మోతీలాల్, రాజు, రాజశేఖర్, జగన్, తేజు హరి, నాగేశ్, బస్సీలాల్, రమేశ్, గణేశ్, సరియా రవి, దత్తు, మల్లేశ్, శ్రీకాంత్, రాజేశ్, నరేశ్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కుండపోత

(మూడో పేజీ తరువాయి)

కురిసిన వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చెరువులు, కుంటల్లోకి భారీగా వర్షం నీరు చేరింది. ధారూరు మండలంలో తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు కుండపోతగా వర్షం కురిసింది. రుద్రారం- నాగసమందర్ గ్రామాల మధ్య వంతెన పైనుంచి కోట్‌పల్లి అలుగు వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఈ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. లోతట్టు ప్రాంతంలో ఉన్న ధారూరు బస్‌స్టేషన్ ప్రాంగణమంతా జలమయంగా మారింది.


బషీరాబాద్: వాగును తలపించిన మెయిన్ రోడ్డు

లోతట్టు ప్రాంతాలు జలమయం

పూడూరు మండలంలో కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చన్‌గోముల్ - మామిడిపల్లి మార్గంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రైతులు తమ పొలాలకు వెళ్లకుండా ఇబ్బందులు పడ్డారు. బొంరాస్‌పేట్ మండలంలోనూ ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మండలంలోని చెరువులు అలుగెత్తి ప్రవహిస్తున్నాయి. బషీరాబాద్‌లో కురిసిన వర్షానికి పంచాయతీ మెయిన్ రోడ్డు వాగులా మారింది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురియడంతో ఈ రోడ్డు వరదనీటితో నిండిపోయి మడుగును తలపించింది. వికారాబాద్ పట్టణంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఒకసారి భారీగా, కొంత సేపటికి ఓ మోస్తరుగా పలుమార్లు వర్షం కురిసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


ధారూరు: బస్టాండ్ ప్రాంగణంలో వరదనీరు


పెద్దేముల్: తట్టెపల్లి సమీపంలో పొంగిపొర్లుతున్న వాగు

కోట్‌పల్లి ప్రాజెక్టును సందర్శించిన ఎస్పీ

భారీ వర్షాల దృష్ట్యా ఎస్పీ నారాయణ రెడ్డి కోట్‌పల్లి ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు నీటి మట్టం, అలుగు ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. రుద్రారం-నాగసమందర్‌ల మధ్య పొంగిప్రవహిస్తున్న అలుగు ప్రాంతాన్ని పరిశీలించి కిందిస్థాయి పోలీసు అధికారులకు తగు సూచనలు చేశారు.

వర్షపాతం వివరాలు

జిల్లాలో గురువారం కురిసిన వర్షానికి పెద్దేముల్ మండలంలో 65.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. ధారూరులో 57.0 మి.మీ., మన్నేగూడలో 48.8 మి.మీ., తొరమామిడిలో 37.3 మి.మీ., పెద్దఉమ్మెంతాల్‌లో 35.5 మి.మీ., తాండూరు ఏఆర్ఎస్‌లో 33.0 మి.మీ., దావలాపూర్‌లో 32.5 మి.మీ., తాండూరులో 32.3 మి.మీ., కాశీంపూర్‌లో 30.0 మి.మీ., బంట్వారంలో 29.3 మి.మీ., మదన్‌పల్లిలో 28.8 మి.మీ. వర్షం కురిసింది. మోమిన్‌పేట్‌లో 26.3 మి.మీ., బషీరాబాద్‌లో 23.0 మి.మీ., యాలాల్‌లో 21.3 మి.మీ., మర్పల్లిలో 19.0 మి.మీ., పరిగిలో 19.0 మి.మీ., కొడంగల్‌లో 18.8 మి.మీ., ముజాహిద్‌పూర్‌లో 18.5 మి.మీ., రాపోల్‌లో 15.5 మి.మీ., వికారాబాద్‌లో 15.0 మి.మీ., దోమలో 14.5 మి.మీ., బొంరాస్‌పేట్‌లో 13.5 మి.మీ., దౌల్తాబాద్‌లో 10.8 మి.మీ., చౌడాపూర్‌లో 8.8 మి.మీ., పుట్టపహడ్‌లో 7.3 మి.మీ. వర్షం కురిసింది.

క్రైం కార్నర్

పిల్లలు పుట్టడం లేదని భర్తకు వీడియో కాల్ చేసి..

- ఫ్యాన్‌కు ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య
- షాక్‌తో కోమాలోకి వెళ్లిన భర్త


రవళి(ఫైల్)

మేడ్చల్ టౌన్/రామాయంపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వివాహం జరిగి మూడేళ్లయినా పిల్లలు కావడం లేదని మనస్తాపంతో ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నిజాంపేట్ మండలం తిప్పలగూడకు చెందిన దంపతులు వినయ్, రవళి(24)లకు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. ఉపాధి నిమిత్తం మేడ్చల్ పట్టణంలోని కింది బస్తీకి కొన్ని నెలలు క్రితం వచ్చారు. ఏళ్లు గడుస్తున్నప్పటికీ పిల్లలు పుట్టక పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన రవళి గురువారం బయటికి వెళ్లిన భర్తకు వీడియో కాల్ చేసి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. షాక్‌కు గురైన భర్త తాను పనిచేసే కంపెనీలోనే కుప్పకూలి కోమాలోకి వెళ్లాడు. వెంటనే తోటి సిబ్బంది వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కీసర రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కీసర సీఐ ఆంజనేయులు కథనం ప్రకారం.. కాశి సాయికుమార్(28) అనే యువకుడు తన తల్లితండ్రులతో కలిసి దమ్మాయిగూడ మున్సిపాలిటీ యాద్గార్‌పల్లిలోని సామిల్‌లో నివాసముంటున్నాడు. వారి వృత్తి అయిన వడ్రంగి పని నచ్చకపోవటంతో కిరాణ దుకాణం కొనసాగిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. అప్పులు అధికమై తీర్చలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆందోళనకు గురైన అతడు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రేమించిన అమ్మాయికి మరో వ్యక్తితో వివాహం కావటంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు అంటున్నారు.

వ్యక్తిగత కారణాలతో వ్యక్తి..

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) వ్యక్తిగత కారణాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. రావల్‌కోల్ గ్రామానికి చెందిన ఇతని(40) అనే వ్యక్తి గురువారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలో స్నానానికి వెళ్లి కౌలు రైతు మృతి

మోమిన్‌పేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బావిలో స్నానానికి వెళ్లిన కౌలు రైతు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని ఎన్కతల గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్ఐ అరవింద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్కతల గ్రామానికి చెందిన నల్ల అంజిరెడ్డికి చెందిన పొలాలను అదే గ్రామానికి చెందిన మ్యాతరి రాములు(57) మూడు సంవత్సరాలుగా కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. బుధవారం వ్యవసాయ పొలంలో కలుపు మొక్కలు తీసేందుకు భార్య యశోదతో కలిసివెళ్లాడు. మధ్యాహ్నం స్నానం చేస్తానని పొలం వద్ద ఉన్న వ్యవసాయ బావికి వెళ్లాడు. ఈ క్రమంలో బావిలో స్నానం చేస్తుండగా ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. భార్య యశోద కేకలు వేయడంతో గ్రామస్థులు, పోలీసులు బుధవారం రాత్రి వరకు బావిలో గాలించినా ఫలితం లేకపోయింది. గురువారం మళ్లీ గాలింపు చేపట్టగా రాములు మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. మృతుడికి ముగ్గురు సంతానం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మర్పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య యశోద ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరవింద్ తెలిపారు.

దాడిలో గాయపడిన వ్యక్తి..

ధారూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దాడిలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి గురువారం మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని నాగారంలో జరిగింది. మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగారం గ్రామానికి చెందిన నీరటి అంజిలయ్య అలియాస్ ఆంజనేయులు(45), భారతమ్మ దంపతులు గ్రామంలోనే ఫాస్టుఫుడ్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. గతనెల 13వ తేదీన యాలాల మండలం రాస్నం గ్రామానికి చెందిన కొంతమంది యువకులు వీరి హోటల్‌కు వచ్చి నూడుల్స్ ఆర్డర్ ఇచ్చారు. అయితే నూడుల్స్‌లో నూనె తక్కువైందని హోటల్ నిర్వాహకుడు అంజిలయ్య, భార్య భారతమ్మతో గొడవకు దిగి దాడికి పాల్పడ్డారు. మారుణాయుధాలతో దంపతులపై విచక్షణా రహితంగా దాడి చేస్తుండగా అడ్డుకోవడానికి వచ్చిన అదే గ్రామానికి చెందిన అమర్నాథ్‌రెడ్డిపైనా యువకులు దాడిచేశారు. ఈ దాడిలో అంజిలయ్య, భారతమ్మలు తీవ్రంగా గాయపడ్డారు. భారతమ్మ మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారం పుస్తెల తాడును వారు లాక్కెళ్లారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు ఆధారంగా రాస్నం గ్రామానికి చెందిన బండరి కృష్ణ, అనంతయ్యలపై కేసు నమోదు చేసి బైండోవర్ చేసి పోలీసులు వదిలిపెట్టారు. అయితే ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అంజిలయ్య మంచానపడి ఆరోగ్యం క్షీణించటంతో గురువారం మృతి చెందాడు. తన భర్త మృతికి కారణమైన నిందితులపై హత్యానేరం కేసు పెట్టాలని భార్య భారతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ వ్యవస్థపై అవగాహన అవసరం


శిక్షణ కార్యక్రమంలో పోలీస్ అధికారులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పద్ధతుల్లో జరుగుతున్న డిజిటల్ నేరాలను అరికట్టడానికి పోలీసులు డిజిటల్ వ్యవస్థపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి.మధుకర్ స్వామి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయ రాష్ట్ర పోలీస్ శిక్షణ కళాశాలలో గురువారం 12 జిల్లాలకు చెందిన 100 పోలీసు అధికారులకు లెవరేజింగ్ సోషల్ మీడియా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ టెక్నలజీపై ఒక రోజు పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.మధుకర్ మాట్లాడుతూ.. సురక్షిత డిజిటల్ పద్ధతులు, సైబర్ నేరాల నివారణకు పోలీసులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఏఐ ద్వారా జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు స్మార్ట్ టూల్స్ వినియోగం పట్ల పోలీసులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణులు ప్రవీణ్ అర్జున్, సైబర్ క్రైమ్ ఫ్యాకల్టీ, కె.అఖిలేష్, మోటివేషన్ స్పీకర్ శ్రీపాదం, ట్రైనింగ్ కాలేజ్ వైస్‌ప్రిన్సిపాల్ కేవీ.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

అధికార లాంఛనలతో ఆర్మీ జవాన్ అంత్యక్రియలు


తిరుపతి(ఫైల్)

దోమ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బడెంపల్లి గ్రామంలో ఆర్మీ జవాన్ తిరుపతి అంత్యక్రియలు గురువారం అధికార లాంఛనలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన కావలి తిరుపతి (47) జమ్మూ కశ్మీర్‌లో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహించి కొన్ని నెలల క్రితం పదోన్నతిపై ఏఎస్ఐగా సికింద్రాబాద్‌లోని హకీంపేట్‌కు వచ్చారు. విధుల్లో ఉండగానే ఆరోగ్యం బాగా లేకపోవడంతో సైనిక్‌పురి ఫిలామిన్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం స్వగ్రామం బడెంపల్లిలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, స్థానిక పోలీసులు గాల్లో కాల్పులు జరిపి అధికార లాంఛనలతో అంత్యక్రియలు నిర్వహించారు. తిరుపతి మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు, అధికారులు సంతాపం తెలిపారు.

పొంచి ఉన్న ముప్పు


స్తంభానికి తాడుతో బిగించిన వైర్లు

బషీరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గొట్టిగకలాన్‌లో ఓ విద్యుత్ స్తంభానికి కరెంటు వైర్లను తాడుతో బిగించడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల చెట్టు విరిగి పడటంతో వైర్లు తెగిపోగా, ఆశాఖ సిబ్బంది రెండు స్తంభాల మధ్య వైర్లను బిగించి వెళ్లినట్లు వారంటున్నారు. ఈ స్తంభానికి వీధిలైటు ఏర్పాటు చేసుకోలేని దుస్థితి ఉందన్నారు. విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఈ ఆశాఖ ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కులకచర్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమేశ్‌కుమార్ అన్నారు. ఆయన గురువారం కులకచర్ల పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ మధ్య కాలంలో తరచూ మేకలు, గొర్రెల దొంగతనాలు జరుగుతున్నాయని, వాటి యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రాత్రి వేళలో కాపలగా ఉండాలని, డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. దొంగతనాల నివారణకు యువత సహకరించాలన్నారు.

గ్రూప్-1 అవకతవకలకు బాధ్యులెవరు?


తాండూరు: అంబేద్కర్ చౌక్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

తాండూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలకు బాధ్యులెవరో తేల్చాలని బీఆర్ఎస్ తాండూరు నియోజకవర్గ అధ్యక్షుడు జోగుల ఎబినేజర్ డిమాండ్ చేశారు. తాండూరులోని అంబేద్కర్ చౌక్‌లో గురువారం నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అసమర్థత వల్ల అవకతవకలు జరిగాయని ఆరోపించారు. దీనిపై సిట్టింగ్ జ్యూడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 29 రద్దుచేయాలన్నారు. మళ్లీ గ్రూప్-1పరీక్షలకు నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.

పబ్లిక్ సర్వీస్ కమిషన్ నైతిక బాధ్యత వహించాలి

వికారాబాద్: గ్రూపు 1 పరీక్షల్లో అవకతవకలు జరగడంతో పబ్లిక్ సర్వీస్ కమిషన్ నైతిక బాధ్యత వహించి చైర్మన్ రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నాయకులు మంచన్‌పల్లి సురేష్ డిమాండ్ చేశారు. వికారాబాద్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా అభ్యర్థులకు 28 కేంద్రాల్లో పరీక్షాసెంటర్లు కేటాయించగా, కోటి ఉమెన్స్ కాలేజీకి చెందిన రెండు సెంటర్లలోనే 71 మంది ఎంపిక కాగా, మిగిలిన 26 సెంటర్లలో కేవలం 139మంది మాత్రమే ఎంపిక కావడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మొత్తం 563 ఉద్యోగాల్లో కేవలం 9శాతం మాత్రమే తెలుగు మీడియం విద్యార్థులు ఉన్నారని ఇది తీవ్రమైన అన్యాయం అని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని హైకోర్టు, సుప్రీం కోర్టుల వరకు వెళ్లే పరిస్థితి రాకుండా అభ్యర్థులకు న్యాయం చేయాలని సురేష్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విద్యార్థి విభాగం, యువజన విభాగ నాయకులు ఎండీ జుబేర్, వరుణ్, రాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.


వికారాబాద్: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు మంచన్‌పల్లి సురేష్

మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం


పరిగి: సెర్ప్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్లు

పరిగి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ లక్ష్యమని టాస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ అనురాధ అన్నారు. స్థానిక జడ్పీహెచ్ఎస్ నంబర్ 1 పాఠశాలలో గురువారం ఉల్లాస్‌పై సెర్ప్ సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టాస్ పరిశీకులు సత్యనారాయణ, వయోజన విద్యాధికారి శ్రీనివాసబాబు, ఏపీఎం రాజు, ఆర్పీలు ఎండీ ఉస్మాన్‌అలీ, వెంకటప్రసాద్, హెచ్ఎం జ్యోతి, ఎమ్మార్సీ సిబ్బంది మోహన్‌బాబు, శ్రీశైలం, చంద్రశేఖర్, శ్రీనివాస్, బావ్‌సింగ్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: వయోజనుల విద్యకు ఉల్లాస్ కార్యక్రమం దోహదపడుతుందని ప్రధానోపాధ్యాయుడు గౌరారం గోపాల్ అన్నారు. టేకులగడ్డ తండా పరిధిలోని దేవాలయ ప్రాంగణంలో గురువారంవీవోఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆవాసా ప్రాంతాల్లోని పాఠశాల విద్యావకాశం పొందని 15 సంవత్సరాలకు పైబడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలన అధికారి శ్రీనివాస్, మహిళా సంఘం సభ్యులు, వీవోఏ పాండు తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల: ఉల్లాస్ నవభారత్ సాక్షరత కార్యక్రమంలో భాగంగా గురువారం స్వచ్ఛంద వాలంటీర్లకు శిక్షణ నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో నిర్వహించిన శిక్షణలో మండల స్థాయి ఆర్పీలు, వీటీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీ వెంకటయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు గోవిందమ్మ, వీవోలేలు కృష్ణ, చంద్రకళ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు


కొడంగల్: అంబులెన్స్‌లో పరికరాల పనితీరును పరిశీలిస్తున్న అధికారులు

పెద్దేముల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని ఈఎంఆర్ఐ సంస్థ స్టేట్‌హెడ్ కిరణ్‌కిషోర్ అన్నారు. తాండూరు నియోజకవర్గంలో పర్యటించి 108, 102 అమ్మఒడి, 1962 వెటర్నరీ మొబైల్ అంబులెన్స్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు. అంబులెన్స్‌లలోని పరికరాలు, వాటి పనితీరును పరిశీలించారు. రికార్డులు తనిఖీచేశారు. మందుల కొరత ఏర్పడితే వెంటనే తమదృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా ఈఎంఈ అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్: అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఈఎంఆర్ఐ సంస్థ రాష్ట్ర అధికారి కిరణ్ కిషోర్ తనిఖీ చేశారు. కొడంగల్‌లో గురువారం 108, 102, 1962 అంబులెన్స్‌లను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోండి


ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేస్తున్న మాజీ సర్పంచ్ జాం రవి, షేక్ మౌలానా, తుర్కకాశ కార్మికులు

శామీర్‌పేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుర్కకాశ కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని బాధిత కార్మికులు స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. మూడుచింతలపల్లి మండలానికి చెందిన తుర్కకాశ కార్మికులు గురువారం స్థానిక ఎమ్మెల్యేను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. ప్రభుత్వం నుంచి కార్మిక బంధు పథకం కింద 45ఏళ్లు నిండిన కార్మికులకు రూ.10లక్షల పెన్షన్ ఇవ్వాలని, రాళ్లు కొట్టే ప్రతీ కార్మికుడికి ఏదైన ప్రమాదం జరిగినపస్పుడు ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరించేలా తగు చర్యలను తీసుకోవాలని కార్మికులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ప్రభుత్వ భూముల్లో ఉన్న గుట్టలను తుర్కకాశ సంఘ సొసైటీకి ప్రభుత్వం ఇచ్చి ఆదుకునేలా సహకారం అందించాలని కార్మికులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై ఎమ్మెల్యే మల్లారెడ్డి స్పందిస్తూ వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో తుర్కకాశ కార్మికుల సమస్యలపై మాట్లాడి పరిష్కారమయ్యేలా బాధ్యతగా చొరవ తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాం రవి, పంచాయతీ వార్డు మాజీసభ్యుడు బురుగు యాదగిరి, భూపాల్‌రెడ్డి, రాములు, తుర్కకాశ సంఘం జిల్లా నాయకులు షేక్ మౌలానా పాల్గొన్నారు.

దసరా నాటికి రైతు భరోసా ఇవ్వాలి

పరిగి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్ రైతుభరోసా సాయం రైతుల ఖాతాల్లో దసరా లోపు ఇవ్వాలని తెలంగాణ కిసాన్ సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు అందె విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. వానాకాలం సీజన్‌లో అధిక వర్షాల కారణంగా అన్ని రకాల పంటలు పూర్తిగా దెబ్బతిని, కోలుకోలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. ఈ సీజన్‌కు ఎకరాకు రూ.6వేల చొప్పున 15ఎకరాల పరిమితి వరకు ఇవ్వాలని కోరారు. దసరా నాటికి రైతుల ఖాతాల్లో జమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

మిల్లులు 30.. బకాయిలు రూ.20 కోట్లు

(ఐదో పేజీ తరువాయి)

కేటాయించగా, యాసంగి సీజన్‌కు వచ్చే బియ్యాన్ని పౌర సరఫరాలశాఖ ద్వారా రేషన్ కార్డు హోల్డర్లకు పంపిణీ చేస్తున్నారు.

డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్‌పై క్రిమినల్ కేసు

కృష్ణసాయి రైస్ ఇండస్ట్రీస్ పేరిట రైస్ మిల్లును ఏర్పాటు చేసిన డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్ తన పేరిట సివిల్ సప్లై శాఖతో ధాన్యంను బియ్యంగా మార్చేందుకు ఒప్పందం చేసుకున్నాడు. ఒప్పందం చేసుకున్న ఆయన పర్యవేక్షణ చేయకుండా మిల్లును 2022లో సంతోష్‌కుమార్, వెంకటేష్‌కు లీజుకు ఇచ్చారు. వారు ధాన్యాన్ని బియ్యంగా మార్చి సమయానికి సివిల్ సప్లై గోదాంకు బియ్యం తరలించకుండా పక్కదారి పట్టించారు. సివిల్ సప్లై అధికారులు మిల్లు యజమాని అయిన రవిగౌడ్‌కు రూ.6 కోట్ల 38 లక్షల 51 వేల పెనాల్టీ విధిస్తూ నోటీసు ఇచ్చారు. లీజుదారులతో తమకు ఎలాంటి సంబంధం లేదని సివిల్ సప్లై శాఖతో ఒప్పందం చేసుకున్న మిల్లు ఓనర్ రవిగౌడ్‌కు సంబంధం అంటూ జిల్లా సివిల్ సప్లై శాఖ మేనేజర్ మోహన్‌కృష్ణ ఆంధ్రజ్యోతితో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే కేసు నమోదు జరిగి రిమాండ్‌లో ఉన్న రైస్ మిల్లు లీజుదారులు సంతోష్‌కుమార్, వెంకటేష్‌ను పోలీసు కస్టడీకి తీసుకున్నారు. విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. రవిగౌడ్ సివిల్ సప్లై శాఖకు జరిమానా చెల్లించాలని నోటీసులిచ్చినా స్పందించడం లేదని మోహన్ కృష్ణ తెలిపారు. ఇదివరకే రవిగౌడ్‌పై యాలాల పోలీస్‌స్టేషన్‌లో ఆన్‌లైన్‌లో ఫిర్యాదు ఉండగా, ఆయనపై క్రిమినల్ కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. అయితే డీసీసీబీ వైస్‌చైర్మన్ రవిగౌడ్‌పై నమోదైన కేసును పోలీసులు మీడియాకు వెల్లడించకుండా గోప్యంగా ఉంచారు.

సంక్షిప్తంగా..

యూరియా కొరత తీర్చాలి

వికారాబాద్: యూరియా కొరత వెంటనే తీర్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదానందారెడ్డి అన్నారు. వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేస్తూ మండల పార్టీ అధ్యక్షుడు శివరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ

పరిగి: జేకే పన్నీర్ కంపెనీ, మెన్‌స్ట్రూల్ హైజీన్ కంపెనీల సహకారంతో ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థులకు గురువారం ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. బాలికలకు రీసెబుల్ శానిటరీ నాప్‌కిన్స్ అందజేశారు. శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ ఎస్.పార్థసారథి, ప్రిన్సిపాల్ జి.సౌజన్య, రీతు, ఏవీ రమణ, బాల పాల్గొన్నారు.

లక్ష్మయ్య మృతి తీరని లోటు

మర్పల్లి: మాజీ సర్పంచ్ లక్ష్మయ్య మృతి పార్టీకి తీరని లోటని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ అన్నారు. బుధవారం రాత్రి అనారోగ్యంతో మల్లికార్జునగిరి మాజీ సర్పంచ్ లక్ష్మయ్య మృతిచెందారు. గురువారం గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో మెతుకు ఆనంద్ పాల్గొని పాడే మోశారు.

ఫుట్‌పాత్‌లపై దుకాణాలు తొలగించాలి

మేడ్చల్ టౌన్: ఫుట్‌పాత్‌లను ఆక్రమించి దుకాణాలు పెట్టుకున్న చిరువ్యాపారులు స్వచ్ఛందంగా తమ దుకాణాలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాశ్ రెడ్డి కోరారు. ప్రధాన మార్కెట్ రోడ్డుకు ఇరువైపులా దుకాణాలతో రోడ్డు ఇరుకుగా మారుతోందని ఫిర్యాదులు అందాయని తెలిపారు.

పోషకాహారంపై అవగాహన

పూడూరు: కంకల్‌లో ప్రాథమిక పాఠశాలలో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ పోషకాహార అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో గురువారం విద్యార్థులకు పోషకాహారంపై వైద్యులు మణికంఠరెడ్డి వివరించారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్: న్యాయశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహిస్తున్న నేషనల్ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం. బాలస్వామి కోరారు. కేసుల్లో రాజీ కోసం ప్రయత్నించేవారికి ఇది మంచి అవకాశమని తెలిపారు.

శామీర్‌పేట: ఈ నెల 10 నుంచి 13 వరకు మేడ్చల్ కోర్టులో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శామీర్‌పేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ తెలిపారు. క్రిమినల్ కేసుల్లో రాజీ కుదుర్చుకోవాలనుకునే కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

సొసైటీ చైర్మన్‌కు పరామర్శ

కులకచర్ల: అస్వస్థతకు గురై వికారాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కులకచర్ల సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్యను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు గురువారం పరామర్శించారు.

యూరియా కొరత లేదు

కులకచర్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత లేదని కాంగ్రెస్‌నాయకులు అన్నారు. గురువారం కులకచర్లలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు విలేకరులతో మాట్లాడారు. కులకచర్లలో యూరియా కొరతపై ఇతర పార్టీల నాయకులు రైతులతో ధర్నాలు చేయిస్తున్నారని తెలిపారు.

ప్రభుత్వ భూమిని కబ్జాచేస్తే చర్యలు తప్పవు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వభూమిని కబ్జాచేస్తే చర్యలు తప్పవని ఘట్‌కేసర్ తహసీల్దార్ డీఎస్ రజిని హెచ్చరించారు. కాచవానిసింగారం రెవెన్యూ పరిధి సర్వేనంబర్ 66లోని ప్రభుత్వభూమిలో నిర్మించిన నాలుగు అక్రమనిర్మాణాలను రెవెన్యూ అధికారులు గురువారం ఎక్సవేటర్ల సాయంతో కూల్చివేయించారు. ఆమె వెంట ఆర్ఐ సాయిరాం, కాచవానిసింగారం జీపీవో రవి, ప్రవీణ్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

జోనల్‌స్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

దుద్యాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జోనల్ స్థాయిలో కొడంగల్‌లో నిర్వహించిన ఖోఖో పోటీల్లో దుద్యాల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు పావని, అవంతి, ప్రణతి, కోమలి, నందిని, శివాని, నాగలక్ష్మి, అనిత, లావణ్య, జ్యోత్స్నలు ద్వితీయ బహుమతి సాధించారు. ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీరాములు, ఉపాధ్యాయులు అభినందించారు.